# భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు




ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 6, నవంబర్ 2025


## ✶ ఆలయాల్లో భక్తుల సందడి

## ✶ ఈస్గాం శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్



ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త

పరమశివుడికి ప్రీతిపాత్రమైన కార్తీకపౌర్ణమిని బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మహిళలు ఉపవాసదీక్ష ఆచరించడం తోపాటు తెల్లవారుజాము నుంచే శివాలయాలకు పోటెత్తారు. బిల్వ దళాలు, జిల్లేడు పూలతో ప్రత్యేకంగా పూజ చేసి, పాలతో శివలింగానికి అభిషేకం చేశారు. పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతం ఆచరించారు. ప్రమిదలు, ఉసిరికాయల్లో కార్తీక దీపాలు వెలిగించారు. పలువురు మహిళలు తమ ఇంటి ప్రాంగణంలో ఆవు నెయ్యితో తులసి మొక్క వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజ చేశారు. మహిళలు రోజంతా ఉపవాసం ఉండి సాయంత్రం శివాలయాల్లో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వివరాలు లోపలి పేజీల్లో..







# ఘనంగా గురునానక్ జయంతి

వాంకిడి, నవంబర్ 5, ప్రభాతవార్త :

మొదటి సిక్కు మత గురు గురునాయక్ 556వ జయంతి వేడుకలను బుధవారం వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు మాహోల్కర్ అశోక్ మాట్లాడుతూ సిక్కు మతం స్థాపించి ప్రజలను ఏకం చేశారని, మనుషులందరూ సమానమని ప్రబోధించారని, అమాయక ప్రజలకు జ్ఞానం బోధించి చైతన్య పరిచినారని. 1469 సంవత్సరంలో పాకిస్తాన్ లోని తల్వాండి గ్రామంలో జన్మించారని, సిక్కు మతంలో పవిత్రమైన పండుగ భావించి ప్రతి కార్తీక పౌర్ణమి రోజున ఘనంగా నిర్వహిస్తారని పేర్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు దుర్గం సందీప్, భారతీయ బౌద్ధ మహాసభ మండల అధ్యక్షుడు దుర్గం దుర్గాజి, సమాజ అధ్యక్షులు శ్యామరావు లహుజి దుర్గే, రాజేశ్వర్ ఉప్రే, ఉపాసకులు శ్యామ్ రావు దొండుజి దుర్గే, నాయకులు కోబ్రగడే చంద్రమణి, జైపాల్, మహేష్, అన్నారావు, జాడే వెంకటి, కోబ్రగడే సురేష్, తిరుపతి, చునార్కర్ బాలు, కార్తీక్, సంతోష్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



# బిప్లవ్ కుమార్ సర్కార్ దేశానికి అందించిన సేవలు అమూల్యమైనవి

## ✳ రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్

కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 5, ప్రభాతవార్త

సుబేదార్ బిప్లవ్ కుమార్ సర్కార్ దేశానికి అందించిన సేవలు అమూల్యమైనవని తన యవ్వనాన్ని, శక్తిని, జీవితాన్ని దేశ రక్షణ కోసం అంకితం చేశారని రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. శివకుమార్ అన్నారు. బిప్లవ్ కుమార్ సర్కార్ భారతదేశ సైనికుడిగా సుబేదార్ హోదాలో రెజిమెంట్ 45 క్యావలరీ నందు 28 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకుని చివరి పోస్టింగ్ పంజాబ్ పటియాల నుండి పదవి విరమణ పొంది తన సొంత గ్రామమైన విలేజ్ నెంబర్ 12 రాంనగర్ ఈస్గాంకు బుధవారం వచ్చారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. శివకుమార్ (రిటైర్డ్ ఆర్మీ) మిగతా 2లో..




# నేడు ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి కబడ్డీ సెలక్షన్ పోటీలు



తాండూర్, నవంబర్ 5, ప్రభాతవార్త

మండలంలోని అచ్చలాపూర్ జెడ్పిహెచ్ఎస్‌లో గురువారం మంచిర్యాల జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి అండర్17 బాలికల కబడ్డీ జట్టు క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం, కన్వీనర్ ఉమాదేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ, పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు సాంబమూర్తి తెలిపారు. గత నెల 15న అచ్చలాపూర్ జెడ్పిహెచ్ఎస్ లో నిర్వహించిన మిగతా 2లో..

# వెలగని రహదారి దీపాలు



## ఇబ్బందుల్లో గ్రామస్తులు, వాహనదారులు

మామడ, నవంబర్ 5, ప్రభాతవార్త

మామడ మండలం పరిధిలోని దిమ్మదుర్తి గ్రామంలో నిర్మల్ నుండి ఖానాపూర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై గత కొన్ని రోజులుగా రహదారి దీపాలు వెలగకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బస్టాండ్ పరిసర ప్రాంతంలో రాత్రి వేళ దారితప్పే ప్రమాదం ఎక్కువగా ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీపాలు వెలగకపోవడం వల్ల రాత్రిపూట రహదారి పూర్తిగా చీకటిలో మునిగిపోతుండటంతో వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. దీంతో ప్రయాణికులు, గ్రామ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు, గ్రామస్థులు అధికారులను తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



## నేడు ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి కబడ్డీ సెలక్షన్ పోటీలు

(మొదటిపేజీ తరువాయి)

మంచిర్యాల జిల్లా స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీలలో ఎంపికైన మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన బాలికలు మాత్రమే ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి ఎంపిక పోటీలకు హాజరు కావాలని వారు సూచించారు.

## బిప్లవ్ కుమార్ సర్కార్ దేశానికి అందించిన సేవలు అమూల్యమైనవి

(మొదటిపేజీ తరువాయి)

పూలమాలతో బిప్లవ్ కుమార్ సర్కార్‌కు ఘన స్వాగతం పలికి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ సైనికుడిగా, అధికారిగా బిప్లవ్ కుమార్ సర్కార్ ప్రదర్శించిన ధైర్యం,నిబద్ధత,త్యాగం మనందరికీ ఎంతో ఆదర్శప్రాయని వారి నిస్వార్థ సేవ సరిహద్దుల్లో మన దేశం సురక్షితంగా ఉండటానికి కారణమైందిని అన్నారు. వారు కమాండ్ చేసిన ప్రతి సందర్భంలోనూ, తమ సహచర సైనికులకు స్ఫూర్తిని ఇచ్చారని వారు తీసుకున్న ప్రతి కఠిన నిర్ణయం వెనుక, దేశం పట్ల వారికున్న అపారమైన ప్రేమ,విశ్వసనీయత ఉందన్నారు. సుబేదార్ బిప్లవ్ కుమార్ సర్కార్ వారి సర్వీసులో ఎన్నో విజయాలు, కొన్ని సవాళ్లు, మరెన్నో మధుర జ్ఞాపకాలతో నిండిన ఈ సైనిక జీవిత ప్రయాణం నేటితో ముగిసిందని కానీ ఇది ఒక ముగింపు కాదు నూతన అధ్యాయానికి ఆరంభం మాత్రమే అన్నారు. మీరు పనిచేసిన ప్రతి క్షణాన్ని మీ అనుభవం,మీ నాయకత్వం మాటలతో చెప్పలేం అని అన్నారు. సుబేదార్ బిప్లవ్ కుమార్ సర్కార్ ఇకపై మీ కుటుంబంతో, మిత్రులతో ఎక్కువ సమయం గడపాలని, కొత్త ఉత్సాహాలను, అభిరుచులను అన్వేషించాలని సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ సర్వీస్మెన్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు పియూష్ మండల్, ఆడిటర్ దీపక్ గైన్, సత్యజిత్ రాయ్, కార్యదర్శి విశ్వజిత్, అడ్వైజర్ సుశాంత్ బుర్మాన్, శివపాడా,అభిమానులు, బంధువులు ఉన్నారు.

## వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు

**తాండూర్,నవంబర్ 5,ప్రభాతవార్త :**

కార్తిక పౌర్ణమి సందర్భంగా మండలంలోని మాదారం టౌన్ షిప్ శ్రీ కోదండ రామాలయంలో, తంగళ్ళపల్లి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరాలయంలో బుధవారం సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దంపతులు చేత గణపతి, మంగళ గౌరీ, నవగ్రహ, అష్టదిక్పాలక పూజలు, శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి వ్రతం వేదమంత్రోచ్ఛరలతో వేద పండితుడు ముద్దు అవధూత శర్మ రామాలయంలో, అర్చకులు గణేష్ శర్మ, శ్రీనివాస్ శర్మ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వైభవంగా నిర్వహించారు. పూజా అనంతరం తీర్థ ప్రసాదాలు,అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



మాదారంలో నిర్వహిస్తున్న సామూహిక సత్యనారాయణ వ్రతం

## గ్రామ గ్రామాన కార్తీక శోభ

**సారంగాపూర్, నవంబర్ 05, ప్రభాతవార్త:**



పవిత్రమైన కార్తీక మాసంలో కార్తీక పౌర్ణమి వేడుకలతో గ్రామ గ్రామాన కార్తీక శోభ సంతరించుకుంది. మండలంలోని అన్ని గ్రామాలలోని ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు జరుపుకున్నారు. ఉదయం నాలుగు గంటలకే తులసి పూజ, దీపారాధనను నిర్వహించారు. పలు ఆలయలను భక్తులు సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. గోదారికి వెళ్లి స్నానం చేసి నదిలో దీపాన్ని వదిలారు. ఇంటిలో ఎంతో భక్తిశ్రద్ధలతో పిండి వంటలు చేసుకుని నూతన వస్త్రాలను ధరించి, ఇళ్లను దీపాలతో సుందరంగా అలంకరిచుకొన్నారు. ఆలయాల్లో అన్నాదానం నిర్వహించారు.

# ఈస్గాం శివాలయంలో వైభవంగా కార్తీక దీపోత్సవం

**కాగజ్‌నగర్ రూరల్,నవంబర్ 5, ప్రభాతవార్త**

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఇస్గాం శ్రీ శివ మల్లన్న స్వామి వారి దేవాలయం నందు ఉదయము శ్రీ స్వామివారి కి ప్రత్యేక అభిషేకంతో కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని దీపాలు వెలిగించుకొని దీప దానాలు అభిషేకాలు చేశారు. సాయంత్రం కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా జరిగాయి. అనంతరం జ్వాలాతోరణ కార్యక్రమం, సాయంత్రం దీపోత్సవ జ్వాలాతోరణం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను దేవాలయం తరఫున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వామివారికి అభిషేక కార్యక్రమం, కార్తీక దీపోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారికి నిర్వహించిన జ్వాలాతోరణం కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించినారు. మండపం నందు కలెక్టర్ సన్మానించి తీర్థ ప్రసాదములు అందజేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా దాతల సహకారంతో భక్తులకు ఉచిత ప్రసాద





ఎల్కపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వితరణ చేశారు. దీపోత్సవం, జ్వాలాతోరణం కార్యక్రమంలో .ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా, దేవాయల ఉత్సవ కమిటి చైర్మన్ మైలారపు మురళీధర్, అర్చకులు సంతోష్ శర్మ, రాజేశ్వర్, శ్రీనివాసా చారి, సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

**పెంచికల్‌పేట్,నవంబర్ 05, ప్రభాతవార్త :**

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక దేవాలయాల్లో భక్తులు విశేషా పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలి వచ్చి అభిషేకాలు, అర్చనలు, దీపారాధనల్లో పాల్గొన్నారు. కార్తీక మాసం చివరి రోజు పౌర్ణమి కావడంతో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, హరహర శంభో నినాదాలతో ఆలయాలను మర్మోగించారు. ఆలయాల పూజారులు ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకలు నిర్వహించారు. మహిళలు, భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

## బెల్లంపల్లి పెద్దబుగ్గ ఆలయానికి కార్తీక శోభ

**బెల్లంపల్లి, నవంబర్ 05, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో గల చారిత్రాత్మక శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయం బుధవారం కార్తీక శోభతో కళకళలాడింది. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించారు, భక్తి పారవశ్యంతో పిల్లలు, పెద్దలతో కలిసి స్వామివారికి ఆలయంలో అభిషేకం చేశారు. ఆలయ ఆవరణలో పెద్ద సంఖ్యలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, లక్సెట్టిపేట, మందమర్రి, తాండూర్, నెన్నెల, కన్నెపల్లి, భీమిని, కాసిపేట, ఆసిఫాబాద్, కొమరంభీం జిల్లాలోని రెబ్బెన, తిర్యాణి, దహెగాం తదితర మారుమూల మండలాలతో పాటు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కె. సతీష్ శర్మ, సహాయక అర్చకులు గట్టు శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మందమర్రికి చెందిన శివరామకృష్ణ భజన మండలి ఆధ్వర్యంలో కార్తీక పురాణ పారాయణం, భజనాలు, సాంస్కృృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కార్తీక దీపోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక అభిషేకంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు భజన కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ ఏ. రవికుమార్, ఆలయ కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవి, ఆలయ ఈ వో బాపురెడ్డి, బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కన్నాల గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ జిల్లపల్లి స్వరూప, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ముర్కూరి చంద్రయ్య, మున్నూరు కాపు సంఘం నాయకులు ముర్కూరి బాలకృష్ణ, ముర్కూరి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసుల ఆధ్వర్యంలో అన్నదానం

**ఉట్నూర్, నవంబర్ 05, ప్రభాతవార్త**




మండలంలోని స్థానిక సార్వజనిక హనుమాన్ ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉట్నూర్ డివిజన్ శ్రీనివాసుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అంతకుముందు ఉట్నూర్ డివిజన్ శ్రీనివాసుల సంఘంను ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమానికి భక్తులు భారీగా తరలి వచ్చి పూజలు చేసి అన్నదాన ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సికారి శ్రీనివాస్, దూద్దెల శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దీప కాంతులతో కార్తీక దీపోత్సవం

**మందమర్రి, నవంబర్ 05, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని శ్రీ సీతారాముల దేవాలయ సన్నిధిలో బుధవారం సాయంత్రం కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణం నిండా వేలాది దీపాల కాంతులతో వెలుగుల హోలీ కట్టినట్లు దివ్యంగా మారింది. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై భక్తి భావపూర్వకంగా సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. వేదమంత్రాలు, హారతులు, మంగళగీతాల మధ్య ఆలయ వాతావరణం ఆధ్యాత్మిక తేజస్సుతో నిండిపోయింది. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. చిన్నారులు నుండి వృద్ధులదాకా అందరూ ఉత్సాహంగా పాల్గొని దీపాలను వెలిగించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా దీప దానం మహత్యాన్ని వివరించిన పురోహితులు, ఈ దినం భక్తి, సేవా భావాలతో గడపాలని సూచించారు. దేవాలయ పరిసరాలు పూలతో, విద్యుద్దీపాలతో అలంకరించబడగా, సాయంత్రం ప్రత్యేక హారతులు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. మొత్తం పట్టణం కార్తీక దీపోత్సవ కాంతులతో ప్రకాశించింది. మందమర్రి పట్టణంలో కార్తీక పౌర్ణమి వేడుకలు పట్టణానికి భక్తి శోభను తీసుకువచ్చాయి.



# జోనల్ స్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి

## మూడు రోజులపాటు కొనసాగనున్న స్పోర్ట్స్ మీట్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

**లక్షెట్టిపేట, నవంబర్ 05, ప్రభాతవార్త**

పట్టణంలోని గురుకుల పాఠశాలలో కాలేశ్వరం జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ మూడు రోజులపాటు కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ రామ కళ్యాణి తెలిపారు. బుధవారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి స్పోర్ట్స్ మీట్ కు సంబంధించిన ఏర్పాట్లపై వివరణ ఇచ్చారు. నవంబర్ 6 నుంచి నవంబర్ 8 వరకు కొనసాగే ఈ స్పోర్ట్స్ మీట్‌లో జోనల్ స్థాయిలోని 15 పాఠశాలల నుండి 1275 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో క్రీడ విభాగం తరఫున ఏర్పాటు చేయడం జరుగుతుందని, మూడు రకాల విభజించామని తెలిపారు. అండర్ 14, అండర్ 17 అండర్ 19 విభాగాలలో జరుగుతాయని తెలిపారు. ఇందులో 8 రకాల ఆటల పోటీలతో పాటు 11 రకాల అత్యాటిక్ పోటీలు కూడా జరుగుతాయని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ క్రీడా పోటీలకు జిల్లా స్థాయి అధికారులతో పాటు పలువురు ప్రముఖ నాయకులకు ఆహ్వానం అందజేశామని తెలిపారు. అందరూ సహకరించి ఈ స్పోర్ట్స్ విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామ కళ్యాణ్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ మహేశ్వరరావు, పీడీలు మల్లిక, రాధ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాగ్మారే సంబాజీ

## ఫీజు రియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

**ఉట్నూర్, నవంబర్ 05, ప్రభాతవార్త:**

ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ డిఎస్ఓ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వాగ్మారే సంబాజీ అన్నారు. బుధువారం అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీల ప్రైవేటు విద్యాసంస్థల రూ.8600 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం వలన ప్రైవేటు విద్యాసంస్థల యజమాన్యులు విద్య సంస్థల బందుకు పిలుపునిస్తున్నారని, విద్యార్థులు యువకులు నిరుద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణంలో భాగస్వాములై శాస్త్రీయ స్వాతంత్ర ప్రజాతంత్ర విద్యా విధానం కోసం తమ పోరాటాన్ని కొనసాగించాలని డిఎస్ఓ పిలుపునిస్తుందని అన్నారు.

## వర్క్ షాప్ మూసివేసే ఆలోచనను విరమించుకోవాలి

### - హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పతెం రాజబాబు

**తాండూర్,నవంబర్ 5,ప్రభాతవార్త :**

బెల్లంపల్లి ఏరియా వర్క్ షాప్ మూసివేసి ఆలోచన విరమించుకోవాలని హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పతెం.రాజబాబు అన్నారు. బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డికి బుధవారం యూనియన్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మాదారం,గోలేటి గనులకు అనేక రకాలుగా ఉపయోగ పడ్డ ఏరియా వర్క్ షాప్ మూసివేతకు ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు.బెల్లంపల్లి ఏరియాలో దాదాపు 100 సంవత్సరలకు సరిపడా అపార బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని,గోలేటి ఏరియా వర్క్‌షాప్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏరియా వర్క్ షాప్ లో పనిచేస్తున్న సూపర్వైజర్ ను టెక్నిషన్స్‌ను డిప్టేషన్స్ పై కైరిగుడ ఓసిపికి బదిలీ చేయడంతో వర్క్‌షాప్‌లోని యంత్రాలు పాడైపోతాయని,కోట్ల రూపాయల విలువైన సామాగ్రి పాడై పోయే అవకాశాలు ఉన్నాయన్నారు. వర్క్ షాప్‌లో ఐఈడి ప్రకారం టెక్నిషన్స్‌ను సరిపడా మ్యాన్ పవర్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏరియాలో వర్క్ షాప్ లేకుంటే ప్రొడక్షన్‌కు సంబంధించిన యంత్రాలు బ్రేక్ డవున్ లక్షల రూపాయలు సింగరేణి సంస్థకు నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్‌సెక్రెటరీ శివారెడ్డి,ఏరియా ఆర్గనేజర్ ఇనూస్, నాయకులు రాజశేఖర్, సంతోష్, పాల్గొన్నారు.





## ఘనంగా సాంస్కృతిక పోటీలు

**మందమర్రి, నవంబర్ 05, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియాలోని సిఈఆర్ క్లబ్‌లో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ (కల్చరల్) ఆధ్వర్యంలో నవంబర్ 4 నుండి 5 వరకు (2 రోజులు) వివిధ విభాగాలలో నిర్వహించిన కంపెనీ లెవెల్ సాంస్కృతిక పోటీలు అంగరంగ వైభవంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో విజేతలకు మందమరి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పోటీలలో విజేతలైన ప్రతిభావంతులు త్వరలో కోల్ ఇండియా స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. వారు అక్కడ కూడా గెలిచి, సంస్థకు గౌరవం తీసుకురావాలని ఆశిస్తున్నాం అని తెలిపారు.ఫోక్ డాన్స్ విభాగంలో బెల్లంపల్లి ఏరియాకు చెందిన ఎన్. శ్రీనివాస్ బృందం మొదటి బహుమతి సాధించగా, ఏరియా జీఎం రాధాకృష్ణ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సిఎంఓఏఐ అధ్యక్షుడు రమేష్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, క్రీడల గౌరవ కార్యదర్శి కార్తీక్, సీనియర్ పిఓ, ఏరియాల క్రీడల సూపర్వైజర్లు డి. జాన్ వెస్లీ, సిహెచ్. అశోక్, ఎం. నరేందర్ రెడ్డి, పరస శ్రీనివాస్, హెచ్. రమేష్, మందమరి ఏరియా క్రీడల సంయుక్త కార్యదర్శి శివకృష్ణ, అలాగే వివిధ ఏరియాల కల్చరల్ కోఆర్డినేటర్లు, కళాకారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## బైక్ మెకానిక్ మృతి

**లక్షెట్టిపేట, నవంబర్ 05, ప్రభాతవార్త**



లక్షెట్టిపేట పట్టణంలోని ఆంధ్ర బోర్‌కు చెందిన బైక్ మెకానిక్ ఎర్రోజుల సత్యనారాయణ (50) బాత్రూంలో కాలుజారిపడి మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. మృతుడు గత నెల 30న ఇంట్లో బాత్రూంలోకి వెళ్ళగా బాత్రూంలో బీపీ ఎక్కువ అయి కాలుజారి బాత్రూంలో పడిపోగా కుటుంబ సభ్యులు గమనించి లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుల పరీక్షించి తలలో బ్లడ్ క్లాట్ అయిందని, వైద్యం కోసం కరీంనగర్ రిఫర్ చేయగా కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రతిమ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని అన్న ఎర్రోజుల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కొనసాగుతున్న టీకాల కార్యక్రమం

**సిర్పూర్ (టి),నవంబర్ 5, ప్రభాతవార్త :**

పశువులకు సోకే గాలికుంటు వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం పశు వైద్యశాఖ ద్వారా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నారు.వెంకటరావుపేట్ గ్రామంలో బుధవారం రోజున పశువైద్యాధికారి విజయ్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించి పశువులకు టీకాలు ఇచ్చారు.విజయ్ మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు వైద్య శిబిరం రోజున రైతులు తమ పశువులను తీసుకువచ్చి టీకాలు వేయించి పశువులకు వ్యాధి ప్రబలకుండా చూడాలని ఆయన అన్నారు. ఆవులు 486, గేదెలు 45 టీకాలు వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజ్ కుమార్ వరప్రసాద్ గోపాలమిత్ర సభ్యులు నాందేవ్ భాస్కర్ రాజేశ్వర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

**లక్షెట్టిపేట, నవంబర్ 05, ప్రభాతవార్త**



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిమలు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు అనే ప్రిన్సిపల్ రమ కళ్యాణి తెలిపారు.. మహబూబబాద్ జిల్లా నెల్లికుదురులో నిర్వహించిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో లక్షెట్టిపేట గురుకుల నుంచి ఒక్క బాలిక విశేష ప్రతిభ చూపి విజయం సాధించారు. ఈ పోటీలో జమిడి ప్రవళిక అనే విద్యార్థిని 44వ జూనియర్ విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు, నవంబర్ వరకు ఘజియాబాద్ (ఉత్తరప్రదేశ్)లో జరగబోయే జాతీయ షూటింగ్ బాల్ పోటీల్లో ఆమె తెలంగాణ రాష్ట్ర తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ విద్యార్థిని విజయం పై పాఠశాల ప్రిన్సిపాల్ కె. రామా కళ్యాణి హర్షం వ్యక్తం చేస్తూ వారికి శిక్షణ ఇచ్చి ప్రొత్సహించిన డి. రమాదేవి, సి.హెచ్. మమత లను అభినందించారు. విద్యార్థికి జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను, సిబ్బందిని నియమించాలి

### - దుంపల రంజిత్ కుమార్ సిఐటియు జిల్లా కార్యదర్శి

### - ప్రజావాణిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

**లక్షెట్టిపేట, నవంబర్ 05, ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులను, సిబ్బందిని నియమించాలని సిఐటియు రంజిత్ కుమార్ కోరారు. మండలంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి రాష్ట్ర ప్రభుత్వం నూతన భవనం నిర్మించింది. ఈ ఆసుపత్రికి లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మూడు మండలాల నుంచి ప్రజలు వైద్యం కొరకు నిత్యం వస్తుంటారు. కానీ, వైద్యులు సిబ్బంది కొరత ఉండటం ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యం అందించడంలో ఇబ్బందులు కలుగుతున్నాయి. కావున నియోజకవర్గ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జిల్లా డిఎంహెచ్ఓ డిసిహెచ్ స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులను సిబ్బందిని నియమించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అడ్లూరి అక్షయ్ కుమార్ సిఐటియు మండల నాయకులు పాల్గొన్నారు.





నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు



చంద్రవెల్లిలో..



బొక్కలగుట్టలో..

# కన్నుల పండువగా కార్తీక పౌర్ణమి

**ఆసిఫాబాద్, నవంబర్ 5, ప్రభాతవార్త:**

కార్తీక పౌర్ణమిని భక్తులు కనులపండవుగా జరుపుకున్నారు. పండగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజామునుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు పట్టణ సమీపంలోని పెద్ద వాగులో పుణ్య స్నానాలు ఆచరించి ఆలయంలో భక్తి శ్రద్ధలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వెలుపల కార్తిక దీపాలు వెలిగించారు. దీంతో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక శోభనెలకొంది. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని పట్టణంలోని ఆర్యవైశ్యులు వాసవి ఆలయం నుంచి పలు విధుల గుండా నగర సంకీర్తన నిర్వహించారు. ఇందులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జ్యోతిర్లింగార్చన....

జిల్లా కేంద్రంలోని సాయి మందిరంలో మంగళవారం రాత్రి నిర్వహించిన సహస్ర జ్యోతిర్లింగార్చనకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఇందారపు మధుకరశర్మ, సాయిశర్మల ఆధ్వర్యంలో గణపతి పూజ, శివలింగానికి రుద్రాభిషేకం నిర్వ హించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో లింగాకారంలో అమర్చిన సహస్ర జ్యోతులను భక్తులు వెలిగించారు.

## అన్నదానాలు.....

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని అసిఫాబాద్ సీఐ బాలాజీ వరప్రసాద్ ప్రారంభించి వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో పవిత్రమైన రోజు కార్తీక పౌర్ణమని, పట్టణ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేకంగా పూజలు చేసినట్లు తెలిపారు.

## చంద్రవెల్లి సోమేశ్వర ఆలయంలో..

**బెల్లంపల్లి, నవంబర్ 05, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో శ్రీ అన్నపూర్ణ సమేత సోమేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కార్తీక్ ఏకాదశి మొదలుకొని పౌర్ణమి వరకు ఐదు రోజులపాటు పంచ పర్వాలుగా చెప్పుకునే ఈ ఐదు రోజులు గ్రామంలో సోమేశ్వర దేవాలయం నుండి గ్రామ పురవీధుల్లో అఖండ దీపాన్ని పట్టుకొని నగర సంకీర్తన నిర్వహించడం జరుగుతుంది. కార్తీక పౌర్ణమి రోజున ఉదయం నగర సంకీర్తన, గోపూజ, ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించడం జరిగింది. అనంతరం శ్రీ సోమేశ్వర వైన్స్ గ్రూప్స్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు ఆకాశదీప ప్రచురణ కార్యక్రమం నిర్వహించి, భజన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సోమేశ్వర దేవాలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు కొమ్మెర మహాదేవ శర్మ, గ్రామంలోని సోమేశ్వర సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఋష్యమూక పర్వతం గిరిప్రదక్షిణకు వేలాది మంది భక్తులు..

**రామకృష్ణాపూర్, నవంబర్ 05, ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బొక్కలగుట్టలో ఉన్న ఋష్యమూక పర్వతం వద్ద బుధవారం కార్తీక దీపోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు గోవిందా గోవిందా నినాదాలతో గిరిప్రదక్షిణ చేసి, బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీపోత్స వంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు.

జిల్లా నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, త్రిదండీ చినజీయర్ స్వామి మంగళాశాసనాలతో, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కృషితో గుడి అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలో చిన్నజీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా, వైద్య సేవలతో పాటు ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని పేర్కొన్నారు. ఋష్యమూక పర్వతం మరింత అభివృద్ధి చెందే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వారు తెలిపారు.



# ఘనంగా శ్రీశ్రీశ్రీ పరమహంస సద్గురు పూలాజీ బాబా వార్షికోత్సవం

**ఉట్నూర్, నవంబర్ 05, ప్రభాతవార్త:**

ఉట్నూర్ పట్టణంలోని పూలాజీబాబానగర్‌లో బుధువారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీశ్రీశ్రీ పరమహంస సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్రం 25వ వార్షికోత్స వంను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పూలాజీబాబా చిత్రపటానికి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు ఇంగలే వామన్, అధ్యక్షులు ఇంగలే కేశవ్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక భక్తులు పూలాజీ బాబా అడుగుజాడల్లో నడవాలని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధ్యాన కేంద్ర ఉట్నూర్ అధ్యక్షులు రాథోడ్ ఫూల్‌సింగ్, మాడావి గంగారాం, విట్టల్, దినేష్, గణేష్, తులసిరాం, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**ఉట్నూర్, నవంబర్ 05, ప్రభాతవార్త:**

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఉట్నూర్ ఎస్ఐ ప్రవీణ్ అన్నారు. బుధువారం ఉట్నూర్ పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు కేసులు నమోదు చేసి లెసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

# విశ్రాంతి ఉద్యోగులు ధ్రువపత్రాలను భద్రపర్చుకోవాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 5, ప్రభాతవార్త:**

ప్రతీ విశ్రాంత ఉద్యోగి వారి ధ్రువపత్రాలను భద్రపరుచుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కర్ణాగౌడ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా దివంగతులైన విశ్రాంత ఉద్యోగులను గుర్తుచేసుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు చెందిన ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్ బుక్, పిపిఓ, నామిని వివరాల పత్రాలు వ్యక్తిగతముగా ఫైల్ చేసుకోవడంతో పాటు ప్రతి ఒకరు జీవన్ ప్రమాన్ (లైఫ్ సర్టిఫికెట్)ను జిల్లా ఖజానా శాఖ కార్యాలయం, విశ్రాంత ఉద్యోగుల సంఘంలో సమర్పించాలని సూచించారు. విశ్రాంత ఉద్యోగులు ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటే 14567లో సంప్రదించాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 7న చేపట్టనున్న భారీ నిరసన దీక్షను తెలంగాణ రాష్ట్ర సంఘ జనరల్ సెక్రటరి చిలువేరి చంద్ర శేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, వివిధ సంఘల రాష్ట్ర ముఖ్య నాయకులు హామీ మేరకు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు సిరాజ్ హుల్ హక్, వెంకన్న, కృష్ణాజీ, వరలక్ష్మి మ్మ,సిడం సూరు,ఆత్రం గోవర్ధన్,గౌరక్క,పిల్లి సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్ణాగౌడ్





# వేలాల మల్లన్న ఆలయంలో కార్తీక దీపోత్సవం

**జైపూర్, నవంబర్ 05, ప్రభాతవార్త**

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం భక్తులు పవిత్ర గోదావరి స్నానం ఆచరించి, దేవాలయాలను దర్శించుకున్నారు. సాయంత్రం వేలాల మల్లికార్జున స్వామి ఆలయం ప్రాంగాణంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయం అంతా కార్తిక దీపోత్స వం వెలుగులలో మెరిసి పోతుంది.

# అడెల్లి పోచమ్మను దర్శించుకున్న విఠల్‌రెడ్డి

**సారంగాపూర్, నవంబర్ 05, ప్రభాతవార్త:**



మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం అడెల్లి పోచమ్మ విగ్రహా పున:ప్రతిష్టాపన కార్యక్రమానికి బుధవారం ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి దర్శించుకున్నారు. ఆయనను పతిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి పుష్పలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అధికారులు బాలాల ఆలయంలో ప్రతేక పూజలు చేసి అతనికి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లోల మురళిదర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, అల్లోల సురేందర్ రెడ్డి, అయిర నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ అట్లా మహిపాల్ రెడ్డి, విద్యసాగర్ రెడ్డి, రాజేశ్వర్‌రావు, గజానంద్‌రావు, ఎస్కె సలీమ్, ఆలయ డైరెక్టర్‌లు, నాయకులు, సాక్ పెల్లి సురేందర్ పాల్గొన్నారు.

### అండర్-17 రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు

# ఆసిఫాబాద్ గురుకుల విద్యార్థులు

**ఆసిఫాబాద్,నవంబర్ 5,ప్రభాతవార్త:**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు అండర్-17 రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ జూలూరి యాదగిరి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల7నుంచి9వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని కోస్గి నారాయణపేట్ నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరఫున ఆసిఫాబాద్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులు డోంగ్రి ఇష్నాత్, నాగోసే మహేష్, జాడి సంజయ్ మోల్కర్ మహేష్ లు పాల్గొంటున్నట్లు తెలిపారు. అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ఎంపికైన విద్యార్థులను కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా విద్యాధికారి దీపక్ తివారి, పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శి వెంకటేష్ ,వైస్ ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీం,పిడి యాదగిరి,పిఈటి ప్రసాద్,పాఠశాల అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.



హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్



## పోచమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

**సిర్పూర్(టి),నవంబర్ 5, ప్రభాతవార్త :**

సిర్పూర్ (టి) మండలంలోని పారిగాం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణానికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు 11,111 రూపాయలు విరాళం అందించారు. ఈ మేరకు కార్తీక పౌర్ణమి సందర్భంగా బిజెపి మండల అధ్యక్షురాలు చనకపురి లావణ్య గ్రామస్తుల సమక్షంలో చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## శివ్వారం భూములకు బహిరంగ మార్కెట్ రేటు చెల్లించాలి

**జైపూర్, నవంబర్ 05, ప్రభాతవార్త**

నూతనంగా రహదారి నిర్మాణానికి అవసరమైన భూములను సేకరిస్తున్న శివ్వారం భూములకు ప్రస్తుత బహిరంగ మార్కెట్ ప్రకారం రేటు చెల్లించాలని భూములు కోల్పోతున్న రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. 150 ఫీట్ల వెడల్పుతో నిర్మించే ఈ రహదారిలో ప్రభుత్వం అందజేసే నష్ట పరిహారంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు వారు వాపోయారు. ఒక్కో ఎకరం ధర 50 లక్షల నుండి కోటి రూపాయాల వరకు ఉన్నట్లు తెలిపారు. ఇటీవల మంచిర్యాల ఆర్.డీ.ఓ శ్రీనివాస్‌ను కలిసి తమ సమస్య పరిష్కారించాలని కోరినట్లు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థి

**చింతలమానేపల్లి,నవంబర్ 5, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కర్జవెల్లి గ్రామానికి చెందిన విద్యార్థి రౌతు విష్ణువర్ధన్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన జోనల్ స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరచి, మహబూబాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు.ఈ సందర్భంగా ఎంఈఓ జయరాజ్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం దానయ్య, పీడీ హరీష్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విష్ణువర్ధన్‌ను అభినందించారు.



రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థి

## జిల్లా స్థాయి ఖోఖో పోటీలలో నీల్వాయి ప్రథమ స్థానం

**వేమనపల్లి, నవంబర్ 05, ప్రభాతవార్త**

జిల్లా స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో భీమారం క్రీడా మైదానం నిర్వహించిన 17 సంవత్సరాల విభాగంలో ఖోఖో పోటీలలో నీల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ప్రథమ స్థానం సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్ రెడ్డి, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు డాక్టర్ డి. మల్లేష్ ఓ ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మండలాధికారులు అందరూ అభినందించారు.



## కొనసాగుతున్న పోచమ్మ విగ్రహా పున:ప్రతిష్టాపన

**సారంగాపూర్, నవంబర్ 05, ప్రభాతవార్త:**

మండలంలోని అడెల్లి పోచమ్మ విగ్రహా పున: ప్రతిష్టాపన కార్యక్రమం భక్తి శ్రద్దలతో కొనసాగింది. బుధవారం చండీయాగ హోమం నిర్వహించారు. ఉదయం 6గంటలకు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు జంటలుగా పాల్గొన్నారు. మూడవ రోజు అమ్మవారికి పాలపూస్పదివాసం చేశారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త మురళీధర్ రెడ్డి, పతిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, అయిర నారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ భోజ గౌడ్, మాజీ చైర్మన్‌లు మాధవరావు, రాజేశ్వర్, మాజీ ఏంపిపి మహిపాల్ రెడ్డి, నాయకులు కరిపే విలాస్, బొల్లెడి నారాయణ రెడ్డి, బొల్లోజి నర్సయ్య, నరేష్, పార్టీలకు ఆతీతంగా నాయకులు, కార్యకర్తలు, మాలాధార స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## అఖిల భారత అధికారులకు వీడ్కోలు

**నేరడిగొండ, నవంబర్ 5, ప్రభాతవార్త:**

శిక్షణలో భాగంగా అఖిల భారత అధికారుల నాలుగు రోజుల కుమారి గ్రామ స్థితిగతుల అధ్యయనం మంగళవారం పూర్తైంది. అనంతరం వారికి మండల ఎంపీడీవో శేఖర్, ఎంపీఓ శ్యాంసుందర్, సబార్డినేట్ మాజీద్ వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అఖిల భారత అధికారులు మాట్లాడుతూ నాలుగు రోజుల అధ్యయనంలో శిశు సంక్షేమం, విద్య, వైద్యం, ప్రజా పంపిణీ వ్యవస్థ, సంక్షేమ పథకాల అమలుతో పాటు అనేక విషయాలు తెలుసుకున్నామని తెలిపారు. సబార్డినేట్ మాజిద్ గ్రామస్తుల సమస్యలు హిందీ భాషలో వారికి వివరించి భాషా వారధిగా నిలిచాడని తెలిపారు. తన సహాయం మధురమైన జ్ఞాపకంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. అనంతరం సబార్డినేట్ మాజీద్ మాట్లాడుతూ అఖిలభారత అధికారులు చాలా అంకితభావంతో పని చేస్తూ కిందిస్థాయి సిబ్బందితో కూడ గౌరవంగా ఉంటారని తెలిపారు.

## స్నేక్ క్యాచర్ కాలును చుట్టేసిన పాము..

**నిర్మల్‌పట్టణం, నవంబర్ 5, ప్రభాతవార్త:**



నిర్మల్ పట్టణంలోని ఓ వాహన షో రూమ్‌లో పాము కలకలం రేపింది. వాహనాలను రిపేర్ చేసే ప్రదేశంలో పాము కనిపించడంతో వెంటనే అప్రమత్తమైన కార్మికులు యజమానికి తెలిపారు. స్థానిక శాంతినగర్ కాలనీకి చెందిన స్నేక్ క్యాచర్ వనీలు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఆయన పామును పట్టుతున్న క్రమంలో తన కాలును అది చుట్టేసింది. స్నేక్ క్యాచర్ చాకచక్యంగా దాన్ని పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేశాడు. దీంతో పరిసర ప్రాంతాల్లో పనిచేసే వారు అతనని అభినందించారు.



## 108 అంబులెన్స్ తనిఖీ చేసిన అధికారులు

**వేమనపల్లి, నవంబర్ 05, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలం కేంద్రంలోని బుధవారం 108 అంబులెన్స్ వాహనాలను ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా 108 అంబులెన్స్ వాహనాల ప్రోగ్రాం మేనేజర్ స్వామ్రాట్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అత్యవసర సమయంలో వినియోగించే పరికరాల పనితీరును, సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి వారు పలు సూచనలు సలహాలు చేశారు. వాహనంలో ఉన్న వైద్య పరికరాలు అత్యవసర సమయాల్లో వినియోగించే మెడికల్ ఎక్విప్మెంట్ ను వాహనంలో ఉన్న మందులను వాటి పనితీరును పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లోనూ 108 వాహనాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వాహన సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని తెలిపారు. అలాగే ఇటీవలే అంబులెన్స్ వాహనంలో సుఖప్రసవం నిర్వహించిన స్థానిక సిబ్బందిని పనితీరును మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా 108 అంబులెన్స్ వాహనాల కార్యనిర్వాహణాధికారి బి. సంపత్, వేమనపల్లి 108 వాహన ఈఎంటి జాడి స్వరూప, పైలట్ సంపత్ రెడ్డి పాల్గొన్నారు.